సాక్షి కామారెడ్డి

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 70 ఫిర్యాదులు నమోదయ్యాయి. కలెక్టర్ పాటిల్ వినతులు స్వీకరించారు.

- 10లో ▸



బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ రాజంపేట మండలంలో పర్యటించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం

34.4 /10.9

వాతావరణం

మంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అమెరికా పర్యటనలో ప్రభుత్వ విప్



సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం అమెరికా బయలుదేరి వెళ్లారు. కూతురు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొననున్నారు. పక్షం రోజుల తర్వాత స్వదేశానికి తిరిగి రానున్నారు.

వైఎస్సార్‌టీపీలోకి జమునా రాథోడ్



కామారెడ్డి టౌన్: జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు జమునా రాథోడ్ సోమవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. వరంగల్‌లో పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో జమునా రాథోడ్, ఆమె భర్త కాంగ్రెస్ నేత డాక్టర్ వెంకట్ వైఎస్సార్ టీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి'తో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు తప్ప ప్రజలకు సేవ చేయాలనే తపన లేదని విమర్శించారు. ఆ పార్టీ కోసం తాము ఎంతగానో కృషి చేసినా తమను మోసం చేస్తూ వచ్చారన్నారు. అందుకే ప్రజలకు సేవ చేయడం కోసం వైఎస్సార్‌టీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యులు నీలం రమేష్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

5,595 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం 5,595 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న 854 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 59,607 మందికి కంటి పరీక్షలు చేసి, 11,670 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

9న అసెంబ్లీ ముట్టడి



నస్రుల్లాబాద్: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు సెకండ్ ఏఎన్‌ఎంలు తెలిపారు. సోమవారం ఉమ్మడి బీర్కూర్ మండల ఏఎన్‌ఎంలు సామూహిక సెలవు కోరుతూ మండల వైద్యాధికారి శ్రీలేఖకు సెలవుపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. దీంతో సమస్యను సర్కారు దృష్టికి తీసుకువెళ్లడానికి అసెంబ్లీ ముట్టడి చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు వెంకట లక్ష్మి, శిరీష, నాగరమణి తదితరులు పాల్గొన్నారు.

విజయపథం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన విజయపథం వాల్ పోస్టర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు అధిక మార్కులు సాధించడానికి విజయపథం అవగాహన సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం అధికారి లింగం, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏసీడీ చార్జీలు రద్దు

నిజామాబాద్‌నాగారం: ఏసీడీ చార్జీలపై విద్యుత్ వినియోగదారులు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో విద్యుత్‌శాఖ వెనక్కితగ్గింది. ఏసీడీ చార్జీలను రద్దు చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీనిపై వినియోగదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

కాస్త ఊరట!

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామని అధికార పక్షం పేర్కొంటుండగా.. అంకెల గారడీగా ప్రతిపక్షాలు కొట్టిపడేస్తున్నాయి. పంట రుణాల మాఫీకి నిధులు కేటాయించడం, సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇస్తామనడంతో జిల్లావాసులు కాస్త ఊరట చెందుతున్నారు.

- పంట రుణాల మాఫీకి నిధులు..
- జిల్లాలో 30 వేల మందికి ప్రయోజనం
- 'సొంతింటి'కి సర్కారు సాయం..
- 8 వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం
- మరికొంత మందికి అందనున్న దళిత బంధు



సాక్షి, కామారెడ్డి: అన్నదాతలను రుణాల ఊబిలో నుంచి బయటపడేసేందుకు రూ. లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. మొదట రూ.25 వేలలోపు రుణాలు, ఆ తర్వాత రూ.50 వేలలోపు రుణాల మాఫీ చేశారు. నాలుగేళ్లు గడుస్తున్నా మొత్తం రుణం మాఫీ కాకపోవడంతో చాలామంది రైతులు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో రూ. 90 వేల వరకు పంట రుణాలు మాఫీ అయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో సుమారు 30 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు.

స్థానిక సంస్థలకు వెసులుబాటు

ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రగతికి సంబంధించిన నిధులు, ఫైనాన్స్ కమిషన్ నిధులను నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. దీంతో స్థానిక సంస్థలకు కాస్త వెసులుబాటు లభించనుంది. పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు కూడా విడుదల చేస్తామని పేర్కొంది.

కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు..

ఎన్నో ఏళ్లుగా క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సర్కారు తీపికబురు చెప్పింది. ఏప్రిల్ నుంచి రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించింది. 2014 నుంచి 2022 వరకు కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించనున్నారు. దీంతో జిల్లాలో నాలుగు వందల మందికి మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆరోగ్య చికిత్సలకు సంబంధించి ఈహెచ్‌ఎస్‌ను ప్రత్యేకంగా అమలు చేసే ప్రక్రియ చేపడతామని ప్రభుత్వం పేర్కొంది. మిడ్ డే మీల్స్ కార్మికుల గౌరవ వేతనాన్ని రూ.3 వేలకు పెంచారు. సెర్ప్ ఉద్యోగుల వేతన సవరణ కు హామీ లభించింది.

జిల్లా రైతుల సాగు నీటి కష్టాలను తీర్చేందుకు ప్రతిపాదించిన కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీకి గత బడ్జెట్‌లలో నిధులు దక్కలేదు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈసారి బడ్జెట్‌లో రూ. 2,614 కోట్లు కేటాయించినా.. జిల్లాకు సంబంధించిన ప్యాకేజీపై స్పష్టత రావాల్సి ఉంది.

ఒక్కో నియోజకవర్గంలో 1,500 మందికి..

దళిత కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకువచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా కామారెడ్డి జిల్లాలో నిజాంసాగర్ మండలాన్ని ఎంపిక చేసి అమలు చేశారు. మండలంలోని దళిత కుటుంబాలన్నింటికీ రూ.10 లక్షల చొప్పున అందించారు. మిగతా నియోజకవర్గాలలో వంద కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గంలో 1,500 మందికి దళితబంధు వర్తింపజేయాలని నిర్ణయించారు.

సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం స్థానంలో సొంత జాగా ఉన్న వాళ్లకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని గతంలో వాగ్దానం చేసింది. అయితే యూనిట్ కాస్ట్‌ను రూ.3 లక్షలకు కుదించి, ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఒక్కో నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఏటా 8 వేల ఇళ్లు మంజూరయ్యే అవకాశాలున్నాయి.

మహిళా సంఘాలకు బకాయిలు చెల్లించాలి

- సర్కారు స్పందించేంత వరకు ఉద్యమం
- బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి
- మున్సిపాలిటీ వద్ద వంటావార్పు

కామారెడ్డి టౌన్: మహిళా సంఘాలకు బకాయిలు చెల్లించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించిన రాయితీ, స్త్రీ నిధి, అభయహస్తం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన 'మరోమారు మహిళా పోరు' నిరసనలు కొనసాగుతున్నాయి. సోమవారం కామారెడ్డి బల్దియా కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపైనే మహిళలు, బీజేపీ నేతలు భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని మహిళలు ఆందోళనలు చేస్తున్నా సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. మహిళా సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపడుతుండడంతో తట్టుకోలేక ఐకేపీ అధికారులపై బదిలీ వేటు వేయడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. మాస్టర్ ప్లాన్ రద్దుకోసం రైతులు రోడ్డెక్కినప్పుడు రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై ఎందుకు వేటు వేయలేదో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10వ తేదీలోగా మహిళా సంఘాలకు బకాయిలు చెల్లించకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు శ్రీకాంత్, పండ్ల ప్రవీణ్, శ్రీనివాస్, మానస, రవి, నరేందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు విపుల్ జైన్, నాయకులు తేలు శ్రీనివాస్, కుంట లక్ష్మారెడ్డి, అన్నుండ్ల సురేశ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మలతో నిరసన

మరోమారు మహిళా పోరులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో బతుకమ్మలతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి కోరారు.



రోడ్డుపై భోజనాలు చేస్తున్న మహిళలు, బీజేపీ నేతలు

11 నుంచి ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

కామారెడ్డి అర్బన్: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఏ, బీఎస్సీ, బీకాం మొదటి సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 11వ తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. 11 నుంచి 17వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ కామారెడ్డి అధ్యయన కేంద్రం సమన్వయకర్త రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు పరీక్ష రుసుం చెల్లించని విద్యార్థులు ఈనెల 10వ తేదీలోగా రూ. 500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 73829 29695 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బల్దియాలో ముదురుతున్న లొల్లి!

- ఎల్లారెడ్డిలో అవిశ్వాసానికే కౌన్సిలర్ల మొగ్గు!
- ఎమ్మెల్యే మాట్లాడినా వెనక్కి తగ్గని వైనం



సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. క్యాంపులో ఉన్న ఏడుగురు సభ్యులతో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడినప్పటికీ వారు వెనక్కి తగ్గడం లేదు.

ఎల్లారెడ్డి బల్దియాలో 12 వార్డులున్నాయి. బల్దియాలో పనులు, బిల్లుల చెల్లింపులు, ప్రొటోకాల్ తదితర సమస్యలతో పలువురు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. సమయం కోసం వేచి చూస్తున్న ఏడుగురు సభ్యులు చైర్మన్‌పై తిరుగుబాటు జెండా ఎత్తారు. వారం రోజులుగా క్యాంపులో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కౌన్సిల్‌లో తిరుగుబాటు సమస్య తలెత్తడంతో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అయితే ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు జరిగినా ఫలితమివ్వలేదని తెలుస్తోంది. చైర్మన్‌ను మార్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్న తిరుగుబాటు కౌన్సిలర్లు.. అవిశ్వాసంపై బెట్టు వీడడం లేదు. వారు అవిశ్వాసం నోటీసు ఇవ్వడానికే నిర్ణయించుకున్నారని సమాచారం. ఒకటి రెండు రోజుల్లో కలెక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుని, అవిశ్వాసం నోటీసు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

వేడెక్కిన రాజకీయం

కౌన్సిలర్ల తిరుగుబాటు నేపథ్యంలో ఎల్లారెడ్డిలో రాజకీయం వేడెక్కింది. నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలు కూడా బలంగా ఉన్నాయి. మున్సిపల్ గొడవను తమకు అనుకూలంగా మలచుకునేందుకు ఆయా పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. దీంతో అవిశ్వాసం రగడ ఎటు దారితీస్తుందోనన్న చర్చ నడుస్తోంది. కౌన్సిలర్లు క్యాంపు నుంచి తిరిగి వస్తేగానీ స్పష్టత వచ్చే అవకాశాలు లేవు.

'పొగాకుతో అనర్థాలను వివరించాలి'

కామారెడ్డి క్రైం: పొగాకు వినియోగం వల్ల వాటిల్లే అనర్థాలను ప్రజలకు వివరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పొగాకు, డ్రగ్స్ నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు నియంత్రణపై కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ షాపులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ప్రిస్కిప్షన్ ఆధారంగానే మందులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్ రాజు, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, డీసీపీవో స్రవంతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

కామారెడ్డి క్రైం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ 2, 3, 4 ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలన్నారు. ఎస్సీ నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య, జిల్లా ఇన్‌చార్జి షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ వసతి గృహం సంక్షేమ అధికారి నాగరాజు, శిక్షకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం పరిశీలించారు. రికార్డులను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సాయిభుజంగరావు, అధికారులు ఉన్నారు.

కొత్త రైతుకు అందని 'సాయం'

- రైతుబంధు కోసం ఎదురుచూపులు
- నిరాశలో మూడు వేల మంది అన్నదాతలు

ఎల్లారెడ్డిరూరల్: కొత్త రైతులకు రైతుబంధు సాయం అందలేదు. దీంతో వారు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు ఏడాదికి రూ. 10 వేల సాయం అందిస్తోంది. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 2,76,886 మంది రైతుల ఖాతాల్లో ఇంతవరకు రూ. 245 కోట్లు జమ చేశారు. కానీ రెండు నెలల క్రితం రైతుబంధు పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం ఇప్పటివరకు పెట్టుబడి సాయం అందలేదు.

యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు పథకం ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవడానికి డిసెంబర్ 7వ తేదీవరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. జిల్లాలో సుమారు 3 వేల మంది కొత్త రైతులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారికి ఇప్పటికీ రైతుబంధు అందించలేదు. నిబంధనల ప్రకారం బ్యాంకు ఖాతా, ఆధార్, పట్టాపాసు పుస్తకం తదితర వివరాలను అందించినప్పటికీ ఇంతవరకు రైతుబంధు జమ చేయలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ రైతుబంధు అందించాలని కోరుతున్నారు.



మూణ్నెళ్లైంది..



మా అమ్మ పేరిట రెండెకరాల భూమి ఉంది. ఆమె మరణించడంతో ఎకరంనర భూమిని నా పేరుపైకి, మరో అర ఎకరాన్ని నా భార్య పేరుపైకి మార్పించుకున్నా. మూడు నెలల క్రితం రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటికీ పెట్టుబడి సాయం అందలేదు. – కుక్కల సాయిలు, రైతు, లింగారెడ్డిపేట

ఖరీఫ్ సీజన్‌లో వచ్చినవారికే..

ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందిన రైతులకే ఈసీజన్‌కు సంబంధించి రైతుబంధు నిధులు మంజూరయ్యాయి. నూతనంగా దరఖాస్తు చేసుకున్నవారికి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ప్రభుత్వంనుంచి వచ్చాక రైతుల ఖాతాలలో జమ చేస్తాం. – రత్న, ఏడీఏ, ఎల్లారెడ్డి

ఏకాగ్రతతో చదవాలి

- మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు
- విద్యార్థుల అల్పాహారం కోసం రూ.2.60 లక్షలు అందజేత



విరాళం అందిస్తున్న ఎంపీపీ నర్సింగరావు

మాచారెడ్డి: ఎస్సెస్సీ విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సూచించారు. మండలంలో పదకొండు ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో 520 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారికి రోజూ ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించేందుకుగాను ఎంపీపీ రూ. 2.60 లక్షలు విరాళం అందించారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షా సమయంలో ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం రూ.2.60 లక్షలు అందించిన ఎంపీపీ అభినందనీయుడని డీఈవో రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మి న్కూరి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, ఎంఈవో ఎల్లయ్య, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మద్దెల రాజు, మాజీ కౌన్సిలర్ రామ్మోహన్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పథంలో దేశం'

కామారెడ్డి టౌన్: ప్రస్తుతం భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ సహాయ ఆచార్యులు సత్తు లింగమూర్తి పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డిలోని ఎస్‌ఆర్‌కే కళాశాలలో స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై చర్చా గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం, సంప్రదాయ వనరులను వినియోగించి రైతుల ఆదాయం పెంచే విధంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన 'శ్రీ అన్న' అనే పథకం వెనకబడిన ప్రాంతాలలో, మెట్ట ప్రాంతాలలో చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా యువతకు ఉపాధి, రైతులకు ఆదాయం లభిస్తాయన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలోనే ఉత్పత్తులు జరిగేలా చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్ మాత్రం పూర్తిగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారని, తాయిలాలకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్‌కే విద్యా సంస్థల ప్రతినిధులు జైపాల్ రెడ్డి, సంతోష్ కుమార్, జిల్లా స్వదేశీ సంపర్క్ ప్రముఖ్ డాక్టర్ రాహుల్ కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ విచారక్ నారాయణ, ఎస్‌ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ దత్తాద్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగమూర్తి

డీఈవో ఆఫీస్ వద్ద భాషా పండితుల నిరసన

కామారెడ్డి అర్బన్: భాషా పండితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ భాషా పండితులు, పీఈటీలు జాబ్ చార్ట్ ప్రకారం తాము 6, 7, 8 తరగతుల వరకే బోధిస్తామన్నారు. కోర్టు తుది తీర్పుకు లోబడి ప్రమోషన్లు ఇచ్చేవరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. నిరసనలో భాషాపండితులు టి.శ్రీనివాస్, రవికుమార్, గఫూర్ శిక్షక్, అంజయ్య, రమేష్, రవికిరణ్, వంశీధర్, బాలరాజు, పుల్యా నాయక్, అజ్మత్, సుదర్శన్, రవి యాదవ్, శివశంకర్, దర్శన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న భాషా పండితుల ఐక్యవేదిక నాయకులు

క్లుప్తంగా

ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్ తొలగింపు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులోని బైపాస్ రోడ్డు సమీపంలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ జలీల్ అహ్మద్‌ఖాన్, డిప్యూటీ వార్డెన్ జఫర్ ఉద్దీన్‌ను విధుల నుంచి తొలగిస్తూ (టెర్మినేట్) తెలంగాణ మైనార్టీస్ గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను నిజామాబాద్ రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ (ఆర్‌ఎల్‌సీ) తో పాటు ఎస్‌ఎస్‌వీ ఏజెన్సీ, హైదరాబాద్ వారికి పంపించారు. ఈ నెల 2న గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో తొమ్మిదో తరగతి విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో సోఫియాన్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతి విషయంలో ఆర్‌ఎల్‌సీ నివేదిక ఆధారంగా రాష్ట్ర కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్‌లను విధుల నుంచి తొలగించారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘంలో ఖాళీలను జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అధ్యక్షతన సోమవారం ఎన్నుకున్నారు. జి ల్లా ఉపాధ్యక్షుడిగా కేశవ, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సురేష్, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా మాయ ప్ర సాద్, పట్టణ యువజన అధ్యక్షుడిగా భరత్, కామారెడ్డి మండల ప్రధాన కార్యదర్శిగా వినయ్‌చారి, తాడ్వాయి మండల అధ్యక్షుడిగా దయాకర్‌లను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని, బీసీ కుల, జన గణన చేసి జనాభా ప్రతిపాదికన రాజకీయ రిజర్వేషన్లు, నిధులు, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అరకొర నిధులు కేటాయిస్తూ వాటిని సై తం ఖర్చు చేయడం లేదని వాపోయారు. సంఘం మహిళ అధ్యక్షురాలు మేదరి లక్ష్మి పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ మారిస్తే కేసులు



నిజాంసాగర్/ఎల్లారెడ్డిరూరల్: ద్విచక్రవాహనదారులు నంబర్‌ప్లేట్లను మారిస్తే కేసులు నమోదు చేస్తామని జుక్కల్ ఎస్సై మురళి, ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్ అన్నారు. సోమవారం వారు వాహనాల తనిఖీలు చేపట్టారు. కొందరు వాహనాల నంబర్‌ప్లేట్లు తొలగించడంతో పాటు నంబర్లను మార్ఫింగ్ చేసి జరిమానాలు పడకుండా తిరుగుతున్నారన్నారు. అటువంటి వాహనాలను సీజ్ చేసి చేస్తామన్నారు.

పద్దుపై మిశ్రమ స్పందన

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలోని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొన్ని రంగాలకు కేటాయింపులపై కొందరు హర్షం వ్యక్తం చేయగా.. విద్యా రంగానికి కేటాయింపులు సరిపోలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెదవి విరిచారు.



బీసీలకు నిధులేవి?



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగింది. బీసీల కంటే తక్కువ సంఖ్యలో ఉన్న వారికి ఎక్కువ కేటాయింపులు చేసి, బీసీలకు రూ.6,229 కోట్లు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. జనాభాలో అత్యధిక శాతంగా ఉన్నటువంటి బీసీలకు ప్రభుత్వం కనీసం రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. – వై ఓమయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతుల అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్ రంగాలకు అత్యధిక నిధులు కేటాయించి పెద్దపీట వేసింది. పంట రుణమాఫీకి నిధులు కేటాయించి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారు. – వీఆర్‌దేశాయి, ఏఎంసీ చైర్మన్, బోధన్

తీవ్ర అన్యాయం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విద్యా వ్యవస్థను అధ్వానంగా మార్చింది. అంకెల గారడీతో ప్రభుత్వం మోసం చేస్తుంది. – దొడ్ల రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి

పెన్షనర్లకు మొండిచేయి



కాలపరిమితి ముగిసినందున పే రివిజన్ కమిటీని నియమించేందుకు నిర్ణయం ప్రకటిస్తారని భావించాం. ప్రతిపాదిత ఎంప్లాయిస్ హెల్త్ స్కీము నిర్వహణలో పెన్షనర్ల, జర్నలిస్టుల వాటా లేకుండానే నగదు రహిత వైద్యాన్ని అందించాలి. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును రద్దు చేసేందుకు బడ్జెట్లో ప్రతిపాదన లేకపోవడం వేలాదిమంది ఉద్యోగులను నిరాశపరిచింది. – రామ్మోహన్‌రావు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

నిరాశపరిచిన బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మరొకసారి విద్యా రంగాన్ని నిరాశపరిచింది. రూ.19,093 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిపింది. మొత్తం బడ్జెట్లో పాఠశాల విద్యాశాఖ 5.54%, ఉన్నత విద్యకు 1% కేటాయింపులు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదని అర్థమవుతుంది. – శంతన్, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు

తక్కువ నిధులు



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయించిన నిధులు దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే తక్కువగా ఉన్నాయి. కొత్త పాఠశాలల స్థాపన, ఉపాధ్యాయుల నియామకం ఊసే లేదు. మన ఊరు–మనబడికి, విశ్వ విద్యాలయాలకు ప్రకటించిన 500 కోట్ల రూపాయలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. – కావేటి వేణుగోపాల్, ఎపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు

ఊరించే అంకెల బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయించిన నిధుల అంకెలు ఊరిస్తున్నాయి. కార్మిక, ఉపాధి రంగాలకు అరకొర నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేశారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు నిరాశజనంగా ఉ న్నాయి. జనాభాలో 52 శాతం ఉన్న బీసీల సంక్షేమానికి 2 శాతం నిధులు కేటాయించడం సరికాదు. – పుట్ట వరదయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి, బోధన్

దళితులను వంచిస్తున్నారు...



కేసీఆర్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తోంది. లెక్కల్లో కోట్ల రూపాయలు చూపించి తీర అర్హులకు అందించడం లేదు. దళిత బంధు కొందరికి మాత్రమే ఇచ్చి రాష్ట్రం మొత్తం ఇచ్చినట్లు చెబుతున్నారు. – ఎమ్మార్పీఎస్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

విద్యారంగాన్ని విస్మరించారు..



రాష్ట్ర బడ్జెట్ విద్యారంగాన్ని విస్మరించింది. బడ్జెట్‌లో 6.57 శాతం మాత్రమే విద్యారంగానికి కేటాయించడం శోచనీయం. కోఠారి కమిషన్‌తో పాటు అనేక కమిటీలు రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం కేటాయింపులు ఉండాలని పేర్కొన్నప్పటికి కేసీఆర్ ప్రభుత్వం విస్మరించింది. మన ఊరు–మనబడికి ప్రత్యేక నిధులు లేవు. మొక్కుబడి బడ్జెట్‌గా ఉంది. – బి దేవులా, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కామారెడ్డి

ప్రాధాన్యత



బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వడం హర్షణీయం. గత ప్రభుత్వాలు ఎన్నడూ కేటాయించని విధంగా రూ.19 వేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించడంతో విద్యార్థులకు మరింత నాణ్యతతో చదువు అందించడానికి అవకాశం ఉంది. – పెంట జలంధర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ హర్షణీయం



చాలీచాలని వేతనాలతో నామమాత్రపు ఉద్యోగ భద్రతతో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తామని ప్రకటించడం హర్షనీయం. పే స్కేల్ ద్వారా సెర్ప్ సంస్థలో పని చేస్తున్న 3,974 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. – కుంట గంగాధర్‌రెడ్డి, సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం



తెలంగాణ బడ్జెట్‌ను రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) పక్షాన స్వాగతిస్తున్నాం. అలాగే విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో కొద్ది సంవత్సరాలుగా నిధులు తగ్గిస్తూ వస్తుంది. 30% నిధులు కేటాయించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాం. – డి సత్యానంద్, టీఎస్ యూటీఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ



ఎబెనెజర్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ పరిశోధక విద్యార్థి ఎం ఎబెనెజర్ పీహెచ్‌డీ సాధించారు. తెయూ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ మామిడాల ప్రవీణ్ పర్యవేక్షణలో 'ఇంప్రూవింగ్ డిఫెన్స్ రెస్పాన్సెస్ ఆఫ్ జెర్బెరా జేమ్స్‌సోనీ అగెనెస్ట్ వెస్టర్న్ పవర్‌థ్రిప్' అనే అంశంపై ఎబెనెజర్ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. సోమవారం తెయూ బయోటెక్నాలజీ విభాగంలో నిర్వహించిన వైవావోస్ (మౌఖిక పరీక్ష)కు కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ మాలోత్ రమేష్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపల్ సీహెచ్‌ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, బీవోఎస్ చైర్మన్ ప్రసన్నశీల, హెచ్‌వోడీ జవేరియాఉజ్మ, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఎబెనెజర్‌ను రిజిస్ట్రార్ విద్యావర్ధిని, అధ్యాపకులు అభినందించారు.

9న ఏఆర్ సెక్షన్‌లో సామగ్రి వేలం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ ఏఆర్ (ఎమ్‌టీ) విభాగంలో పలు వస్తువులకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు సీపీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలకు వాడి తీసివేసిన టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు, ఇంజిన్ ఆయిల్ తదితర వాటికి ఈ నెల 9న ఉదయం 10:30 గంటలకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కామారెడ్డి ప్రజావాణికి 70 వినతులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 70 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 37 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా డీఎంహెచ్‌వోకు 1, డీపీవోకు 7, డీఈవోకు 2, డీఆర్‌డీఓకు 09, ఉపాధి కల్పనాధికారికి 3, ఎలక్ట్రిసిటికి 3 ఫిర్యాదులు వచ్చాయి. మిగతా ఫిర్యాదులు ఆయా శాఖలకు చెందినవి. కలెక్టర్ పాటిల్ ఫిర్యాదులదారుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఏవో రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా సెలవు ది నంగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్, జీవీఎస్, లంబాడీల ఐక్యవేదిక సేవాలాల్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సునావత్ గణేష్ నాయక్, సభావాత్ వినోద్ నాయక్, గంగావత్ వినోద్ నాయక్, నౌసిలాల్, బోజునాయక్, సురేష్ నాయక్, స్వామి నాయక్, సంజీవ్ నాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి రవాణా కేసులో పదేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా కేసులో కామారెడ్డికి చెందిన కుంచెం దేవరాజుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు. ఈ మేరకు కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం శ్యాంశ్రీ సోమవారం వెలువరించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరావు ఆధ్వర్యాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో గత ఏడాది మే 3న తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్విఫ్ట్ కారులో రూ.4.50లక్షల విలువైన 150 కేజీల గంజాయి తరలిస్తున్న కామారెడ్డికి చెందిన కుంచెం దేవరాజు, బోదాసు రాజు, ఉప్పల నరేష్ పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకుని కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా విచారణలో కుంచెం దేవరాజుపై నేరం రుజువు కాగా, మిగిలిన వారిపై రుజువు కాలేదు. దీంతో దేవరాజుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు వాదించగా, హరిగోపాల్, ఏ నాగేశ్వరావు విచారణకు సహకరించారు.

భార్యను పొడిచిన భర్తకు మూడేళ్లు..

బోధన్: కట్టుకున్న భార్యను కల్లు సీసాతో కడుపులో పొడిచిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తు సోమవారం బోధన్ కోర్టులో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవాన్ అజయ్ కుమార్ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 15 రోజుల పాటు సాధారణ జైలు శిక్షణ అనుభవించాలని పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన ప్రకారం వివరాలు.. బోధన్ మండలం సాలూరా గ్రామానికి చెందిన సవిత అలియాస్ పీరుబాయికి, చందూర్‌కు చెందిన పసుపు శ్రీనివాస్‌తో పదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెళ్లి అనంతరం కొంత కాలానికి మద్యానికి బానిసైన శ్రీనివాస్ భార్యను వేధించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో కుల పెద్దలు ఇరువురిని సముదాయించారు. అయినా శ్రీనివాస్ వైఖరి మార్చుకోకుండా భార్య వేధించేవాడు. 2020 జూలై 14న భార్యను తలపై కొట్టడంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించి సవిత పుట్టినిల్లు సాలూరా గ్రామానికి పంపించారు. తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని మనస్సులో పెట్టుకుని శ్రీనివాస్ కల్లు సీసాతో సవిత కడుపులో పొడిచాడు. సవిత కేకలు పెట్టడంతో శ్రీనివాస్ అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బోధన్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణనంతరం న్యాయమూర్తి ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోసానిపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చోరీకి పాల్పడిన వ్యక్తికి గ్రామస్తులు సోమవారం దేహశుద్ధి చేశారు. స్వామి అనే వ్యక్తి ఆదివారం రాత్రి అంగన్‌వాడీ కేంద్రంలో పప్పులు, బియ్యం, వంట గిన్నెలతో పాటు హనుమాన్ మందిరం ఆలయ పరిధిలో గల ఇనుప చువ్వలను దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగిలించిన వస్తువులను సోమవారం పట్టణంలోని పాత ఇనుప సామను దుకాణంలో విక్రయిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని చితకబాదారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.


ఒకరి అదృశ్యం



శ్రీనివాస్‌యాదవ్

ఖలీల్‌వాడి: నగరంలోని హమాల్‌వాడికి చెందిన జక్కుల శ్రీనివాస్ యాదవ్(47) అదృశ్యమైనట్లు మూడో టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 1న శ్రీనివాస్ యాదవ్ తన కొడుకు ధనుష్ యాదవ్‌తో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో సోమవారం ధనుష్‌యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లింగాయిపల్లికి చెందిన ఒకరు..



గంగయ్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం లింగాయపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మీసాల గంగయ్య భార్య సుమలత ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇటీవల కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 2న గొడవ పడ్డారు. దీంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గంగయ్య తిరిగి రాలేదు. దీంతో అతని భార్య సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



లక్ష్మణ్ (ఫైల్)

నిజాంసాగర్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండంలోని కొమలంచ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా గ్రామానికి జౌతి లక్ష్మణ్(37), పద్మ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. రోజు కూలీ పనులు చేస్తే తప్ప పూట గడవని కుటుంబం వారిది. భార్య, భర్తలు ఇద్దరూ కూలీ పనులు చేస్తున్న క్రమంలో లక్ష్మణ్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం సేవించడానికి డబ్బులు లేకపోవడంతో తరుచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ఆదివారం రాత్రి చిత్తుగా మద్యం తాగి వచ్చిన లక్ష్మణ్ భార్యతో గొడవ పెట్టుకొని చేయి చేసుకొని చంపుతానని బెదిరించాడు. తాగిన మైకంలో ఉన్న భర్తను చూసి భయాందోళన గురైన పద్మ తన పిల్లలను తీసుకొని రాత్రి వేళ తల్లిగారి ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి వరకు మద్యం తాగిన లక్ష్మణ్ ఇంట్లో ఎవరు లేకపోవడంతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం చుట్టు పక్కల వారు గమనించి సర్పంచ్ సాదుల అనురాధసత్యనారాయణకు సమాచారం అందించారు. ఈ మేరకు సర్పంచ్ పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్సై రాజేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మానసిక పరిస్థితి బాగాలేక యువకుడు..




ప్రశాంత్ మృతదేహం

నందిపేట్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన మోర్తాడ్ ప్రశాంత్(23) మానసిక పరిస్థితి బాగాలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ప్రశాంత్ కొంతకాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. సోమవారం ఉదయం మండలంలోని ఐలాపూర్ శివారులో గల ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌ను పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లితోపాటు అన్న సైతం మానసిక పరిస్థితి బాగాలేక గతంలో చనిపోయారు. మృతుడు తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

జంగంపల్లిలో గల్ఫ్ బాధితుడు..

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో గల్ఫ్ బాధితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బోమ్మని ప్రణయ్‌కుమార్ (31) మూడేళ్ల క్రితం గల్ఫ్‌దేశానికి బతుకు దెరువు కోసం వెళ్లాడు. అక్కడ కంపెనీలు ఎత్తివేయడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి గల్ఫ్ వెళ్లి తీవ్రంగా నష్టపోయానని తరచు బాధపడేవాడు. గ్రామం సమీపంలో ఉన్న దాబా హోటల్‌లో కార్మికుడిగా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం హోటల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాకపోవడంతో ఆయన భార్య రజిత హోటల్ వద్దకు వెళ్లి అడగ్గా తమ వద్దకు రాలేదని తెలిపారు. సోమవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు గుర్తించారు.

చెరుకు ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి



లక్ష్మీపతి(ఫైల్)

తాడ్వాయి: తాడ్వాయి మండలంలోని క్రిష్ణాజీవాడి శివారులో చెరుకు ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మీపతి(55) ఆదివారం రాత్రి తన బైక్‌పై మండలంలోని బ్రహ్మజీవాడి నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. లింగంపేట మండలం ఒంటర్‌పల్లి తండా నుంచి ట్రాలీ ట్రాక్టర్‌లో చెరుకు నింపుకొని వెళ్తున్న ట్రాక్టర్‌ను లక్ష్మీపతి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, కుమారులు రంజిత్, రాకేష్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో పడి ఒకరు..



మృతదేహాన్ని తీసుకువస్తున్న మత్స్యకారులు

బాల్కొండ: మెండోరా మండలం కొడిచర్ల గ్రామ శివారులో గోదావరిలో ప్రమాదవశాత్తు జారి పడి అదే గ్రామానికి చెందిన గేదెల కాపరి సాకలి సాయన్న (50) మృతి చెందాడు. మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయన్న, మరో గేదెల కాపరి నాగభూషణంతో కలిసి గ్రామ శివారులోని గోదావరి అంచున గేదెలను మేపుటకు ఆదివారం ఉదయం వెళ్లాడు. సాయన్న కాలకృత్యాల కోసం గోదావరిలోకి వెళ్లి ప్రమాదవశత్తు జారి పడ్డాడు. సాయన్న ఆచూకీ కనిపించడం లేదని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మత్స్యకారుల సాయంతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం మధ్యాహ్నం మృతదేహం లభించింది.

బొలెరో వాహనం ఢీకొని ఒకరు..

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా సమీపంలో బాన్సువాడ– గాంధారి ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. బాన్సువాడ పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. పిట్లం మండలం కారేగాం గ్రామానికి చెందిన మేతరి అంజయ్య (36) కామారెడ్డిలో తన ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుని పిట్లం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చైన్ స్నాచింగ్

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులోని గాంధీ నగర్‌లో మహిళా మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. గాంధీనగర్‌లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పక్కన మంథని గ్రామానికి చెందిన సత్తెమ్మ నేరేడు పండ్లను విక్రయిస్తుంది. పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నేరేడు పండ్లు కొంటామని ధర ఎంతో చెప్పాలని మాట్లాడుతూ మెడలో ఉన్న గొలుసును లాక్కెళ్లారు. సత్తెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నస్రుల్లాబాద్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

బాన్సువాడ టౌన్: నస్రుల్లాబాద్ బీట్ ఆఫీసర్‌ను రెండు రోజుల క్రితం జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో లింగంపల్లి ఉంది. లింగంపల్లి కంపాట్‌మెంట్ నంబర్ 276లో సుమారు 20 ఎకరాల అటవీశాఖకు చెందిన భూములు కబ్జాకు గురయ్యాయి. ఫారెస్ట్ భూము లు కబ్జాకు గురైన ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారే కారణంగా బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఫారెస్ట్ భూములు కబ్జాకు సదరు బీట్ ఆఫీసర్ ప్రమేయం ఉన్నట్లు సమాచారం. అటవీ శాఖ భూముల కబ్జాలో స్థానిక రాజకీయ నాయకుల పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. ఫారెస్ట్ భూములను కాపాడాల్సిన అధికారులే మాముళ్లకు ఆశపడి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై బాన్సువాడ ఎఫ్‌ఆర్‌వో సంతోషిని వివరణ కోరగా నస్రుల్లాబాద్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయడం వాస్తమేనని, ఆమెపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.